క్లుప్తంగా

హిజ్రాల సేవానిరతి..



పైడితల్లి దీక్షాపరులకు పండ్లు అందజేస్తున్న కొండబాబు, తదితరులు

విజయనగరం టౌన్: పైడితల్లి మాలధారణ చేసిన భక్తులకు హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ వ్యవస్థాపక గౌరవాధ్యక్షుడు కొండబాబు ఆధ్వర్యంలో పలువురు హిజ్రాస్ విశేషమైన సేవలందించారు. ఇరుముడితో వచ్చే దీక్షాపరులకు పెద్దచెరువు ఒడ్డున ఉన్న విజయసాగర్ దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద మంచినీరు, టీ, కాఫీ, కమలాపండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు దవడ మీనా, కార్యదర్శి ప్రవంతి, సభ్యులు పాల్గొన్నారు.

అభినందనలు



ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు

విజయనగరం అర్బన్: వివిధ పట్టణాల్లో ఇటీవల జరిగిన ఎన్‌సీసీ జాతీయ శిబిరాలల్లో స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పలువురు క్యాడెట్లు పాల్గొని ప్రశంసలు పొందారు. దీంతో పంజాబ్, హైదరాబాద్, తదితర ప్రాంతాల్లోని శిబిరాల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన క్యాడెట్లు నాగప్రసన్న, ఢిల్లేశ్వరరావు, ఎం. రఘు, తదితరులను కళాశాల డైరెక్టర్ ఎం. శశిభూషణరావు, తదితరులు బుధవారం అభినందించారు.

సోదరభావం అలవర్చుకోవాలి



సోదరులకు తిలకం దిద్దుతున్న బీకే అన్నపూర్ణ

విజయనగరం టౌన్: ప్రతిఒక్కరూ సోదరభావాన్ని అలవర్చుకోవాలని బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల జిల్లా ఇన్‌చార్జ్ రాజయోగిని అన్నపూర్ణ అన్నారు. కంటోన్మెంట్ వద్దనున్న బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో అన్నాచెల్లెళ్ల పండగ భాయ్ దూజ్‌ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దివ్య సంబంధానికి ప్రతీకగా ఈ పండగను నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన వైద్యులు వెంకటేశ్వరరావు, శంకరరావు, సతీష్‌మూర్తి, గోపాలరావు, బీకే మాధురి, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన తప్పనిసరి



పంటకోత ప్రయోగంలో పాల్గొన్న సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు అలవర్చుకోవాలని ఆ విభాగం ఉత్తరాంధ్ర రీజనల్ అధికారి ప్రకాష్ సూచించారు. మండలంలోని తంగుడుబిల్లి గ్రామంలో వరి పంటకోత ప్రయోగాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంట కోత ప్రయోగంలో ఎకరాకు 28 బస్తాల వరకు దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది సత్యనారాయణ, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

విజయనగరం క్రైమ్: అగ్ని ప్రమాదాలపై విద్యార్థులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సహాయక అగ్నిమాపక శాఖాధికారి వి.సోమేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక బీసెంట్ స్కూల్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పి.మహేష్, పి.మురళి, ఎన్.వాసుబాబు, ఎస్.రామారావు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



డెంకాడ: పుస్తక పఠనంతో విజ్ఞానం వస్తుందని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల సోషల్ టీచర్ కేవీ సుధాకర్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం అంటే ఇష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వై.మహేష్, పీఈటీ వై.హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి...



నెల్లిమర్ల రూరల్: సతివాడలో వలంటీర్లకు కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమానికి నోచుకోని ప్రజలు నేడు సంక్షేమ పథకాలు ఇంటి వద్దనే పొందుతున్నారు. పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి శరవేగంగా సాగుతోంది. రోడ్లు, కాలువలు, ప్రాజెక్ట్‌లు, భవన నిర్మాణాలు వంటి అభివృద్ధి పనులు ఓ పక్క జరుగుతుంటే.. మరోపక్క వ్యవసాయ రంగం బలోపేతమవుతోంది.. పరిశ్రమలు వెల్లువలా వస్తూ వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఇంటి వద్దనే వైద్యం.. ఒకటో తేదీనే పింఛన్.. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు... ఇలా ఎటు చూసినా అభివృద్ధే కనిపిస్తోంది.. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి జగన్ మోహన్‌రెడ్డి అవసరాన్ని వివరిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరుతున్నారు. ఈ క్రమంలో విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



నెల్లిమర్ల: వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు



భోగాపురం: పోలిపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



విజయనగరం: లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఆశపు వేణు, బంగారునాయుడు, ముద్దాడ మధు, తదితరులు



డెంకాడ: పెదతాడివాడ సచివాలయంలో సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ఖర్చు చేసిన వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, తదితరులు



పూసపాటిరేగ: బత్తివలసలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పి. అప్పలనాయుడు, సత్యనారాయణరాజు, మహంతి శ్రీనివాసరావు, తదితరులు

భవిష్యత్ తరాలకు భరోసా 'వైఎస్ జగన్'

• ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ



నెల్లిమర్ల రూరల్: లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు



విజయనగరం: కేఎల్‌పురంలో లబ్ధిదారుతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భవిష్యత్‌తరాలకు భరోసాగా నిలబడుతున్నారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా పర్యటించి ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సంతోషంగా ఉన్నామని, పథకాలన్నీ అందుతున్నాయని ప్రజలు చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ, భావితరాలకు భరోసాగా జగనన్న ఉన్నారనే ధైర్యాన్ని కల్పించే దిశగా ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. గత పాలనలో బడుగు, బలహీన వర్గాలు అట్టడుగు స్థాయిలో ఉండేవన్నారు. అటువంటి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేసి బాసటగా నిలుస్తున్నారని చెప్పారు. ప్రజలకు జరిగిన మంచితో ఇంటింటా అపూర్వ స్వాగతం లభిస్తోందని, సంక్షేమ రాష్ట్రంగా నిలబెట్టేందుకు పాటు పడుతున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా ఇంటివద్దకే పథకాలు అందిస్తున్నామని చెప్పారు. డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయడమే కాకుండా ఆర్థిక చేయూతను అందిస్తున్నామన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, అధికారులు, నేతలు పాల్గొన్నారు.

కేఎల్‌పురంలో..

విజయనగరం: నగరంలోని కేఎల్ పురం యూత్ హాస్టల్ నుంచి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల తమ్మన్నశెట్టి పాల్గొన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వల్ల ఒక్కో ఇంటికి ఎంత లబ్ధి చేకూరిందో వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పనితీరుపై ప్రజల స్పందన తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం చక్కటి వేదికగా నిలుస్తోందన్నారు. ప్రతిచోటా ప్రభుత్వానికి అనుకూలంగా ప్రజా స్పందన లభిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషికుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు తాళ్లపూడి పండు, తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి ఆరోగ్య భద్రతే సీఎం లక్ష్యం

• ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు



లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో ప్రతి పేదవాడి ఆరోగ్య భద్రతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. మండలంలోని మొయిదలో పలువురికి రూ.3.15 లక్షల విలువ చేసే సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. జరజాపుపేటకు చెందిన ఆల్తి సీతకు రూ.1.30 లక్షలు.. చంద్రంపేటకు చెందిన మొయిద స్వాతికు రూ. 1లక్ష.. పూతికపేటకు చెందిన సత్యనారాయణకు రూ. 85 వేల విలువ చేసే చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సురేష్ బాబు మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందు వరుసలో ఉంటారన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా రాష్ట్రంలో లక్షలాది మంది కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. అనంతరం లబ్ధిదారులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ సురేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు యడ్ల గోవింద, ధవళ లక్ష్మణరావు, అట్టాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బొత్స త్వరగా కోలుకోవాలి

భోగాపురం: గుండెకు శస్త్రచికిత్స చేసుకున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ త్వరగా కోలుకోవాలని మారుతి దివ్యాంగుల సేవా సంస్థ అధ్యక్షుడు రామిశెట్టి చిన్నారావు ఆకాంక్షించారు. ఈ మేరకు బుధవారం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దివ్యాంగులు ముద్దన భాస్కరరావు, బమ్మిడి నరసింగరావు, పాపారావు, వి. కామేశ్వరరావు, మాత రమణ, సన్యాసి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ సాధారణ సమావేశం

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు కమిషనర్ రెడ్డి.శ్రీరాములనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కార్పొరేటర్లతో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు హాజరుకావాలని సూచించారు. సమావేశంలో అజెండాలో రూపొందించిన వివిధ అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు.

ప్రశాంతంగా మండల బడ్జెట్ సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ మహంతి కల్యాణి

పూసపాటిరేగ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మహంతి కల్యాణి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన బడ్జెట్ సమావేశం ప్రశాంతంగా ముగిసింది. 2023–24 ఆర్థిక సంవత్సర రాబడి, ఖర్చులు, నిల్వలపై చర్చించారు. రానున్న 2024–25 ఆర్థిక సంవత్సర అంచనా బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అవి తప్పుడు ఆరోపణలే...

పూసపాటిరేగ: మండలంలోని చోడమ్మఅగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిపై కావాలనే తప్పుడు ఆరోపణలు చేశారని కొందరు తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయుడిపై వచ్చిన మౌఖిక ఆరోపణలపై సస్పెన్షన్ వేటు వేసిన నేపథ్యంలో పాఠశాల వద్ద బుధవారం ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ ఈఓ కంది వాసుదేవరావు పాఠశాలకు చేరుకుని ఆరా తీశారు. ఆయన వెంట ఎంఈఓ రాజ్‌కుమార్ ఉన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

• ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



ఎస్‌డబ్ల్యూపీఎస్ ప్రహరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండంలోని పోలిపల్లిలో రూ.35.94 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతుభరోసా భవనం, ఎస్‌డబ్ల్యూపీఎస్ ప్రహరీని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ కర్రోతు వెంకటరమణతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మట్టినే నమ్ముకున్న రైతాంగానికి గత టీడీపీ ప్రభుత్వం మొండిచెయ్యి చూపిందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేశారని చెప్పారు. రైతుభరోసా పథకం ద్వారా వ్యవసాయానికి పెట్టుబడి సాయం ఇవ్వడం, భూసార పరీక్షలు చేయడం, రాయితీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాల పంపిణీ, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతన్నల కుటుంబాల్లో వెలుగులు నింపిందని తెలిపారు. స్వర్ణయుగంలాంటి పాలన అందిస్తున్న జగనన్నను వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల భానుప్రకాశ్, కర్రోతు రాజశేఖర్, కర్రోతు శ్రీనివాసరావు, సుందర హరీష్, కర్రోతు సత్యనారాయణ, పతివాడ రామకృష్ణ, కర్రోతు శంకర్, కర్రోతు బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

20,21 తేదీల్లో నిరసన దీక్ష



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఉన్న కృష్ణా జలాల పునః పంపిణీ గెజిట్ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా ఈనెల 20, 21 తేదీలలో విజయవాడలో సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న 30 గంటల నిరసన దీక్షను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ కోరారు. బుధవారం స్థానిక అమర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 80,000 ఎకరాల్లో వరి పంట పూర్తిగా ఎండిపోయిందని.. సుమారు లక్షల ఎకరాల్లో సాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, కార్యవర్గ సభ్యులు ఎస్. రంగరాజు, బాయి రమణమ్మ పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



ఆర్‌ఐ మాధురికి సమస్యలు వివరిస్తున్న కార్మికులు

పూసపాటిరేగ: సీపీ పరిశ్రమ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పలువురు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకుడు నల్ల అప్పలరాజు మాట్లాడుతూ, కార్మికశాఖ అధికారులు చర్చలకు పిలిచినప్పటికీ పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు రావడం లేదన్నారు. ఎటువంటి కారణం లేకుండా నోటీస్ ఇవ్వకుండా పరిశ్రమ మూసివేయడంతో కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఆర్‌ఐ మాధురి స్పందిస్తూ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



డిమాండ్లతో కూడిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘ అధ్యక్షుడు ప్రసాద్, తదితరులు

విజయనగరం టౌన్: రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీకే ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక రైల్వే న్యూ కాలనీలో ఉన్న సంఘ కార్యాలయంలో సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైల్వేశాఖలో పదవీ విరమణ చెందిన ఉద్యోగులకు తర్వాత వచ్చే సమస్యలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించి, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. పెన్షనర్లు తమ సభ్యత్వాన్ని రెన్యువల్ చేయించుకోవాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి విశ్వనాథం, వి.అప్పారావు, పి.వెంకటరావు, ఎం.శ్రీరామూర్తి, ప్రకాశరావు, వి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం..



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం కోలగట్ల నివాసంలో విద్యార్థి విభాగం ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, రానున్న ఎన్నికలకు పార్టీ శ్రేణులన్నీ ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ పార్టీకి చేరువ చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కరుమజ్జి సాయి, పట్టణ అధ్యక్షుడు కేదరిశెట్టి లక్ష్మణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్‌కు పార్కు నిర్వహణ బాధ్యతలు



మహిళా పార్కులో సౌకర్యాలపై చర్చిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలోని మహిళా పార్కు నిర్వహణ బాధ్యతలను ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులతో కూడిన కమిటీకి అప్పగిస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. 17వ డివిజన్ ప్రకాశం పార్కును ఆరు నెలల కిందట మహిళా పార్కుగా తీర్చిదిద్దారు. పార్కులో క్రీడాసామగ్రి, వ్యాయామ పరికరాలతో పాటు ఈత కొలను కూడా ఏర్పాటు చేశారు. అలాగే సాయంత్రం సమయాలలో ప్రొజెక్టర్‌తో వినోద కార్యక్రమాలు ప్రదర్శించే విధంగా వేదికను కూడా నిర్మించారు. కేవలం మహిళలకే ప్రవేశాన్ని కల్పిస్తూ పార్కును నిర్వహణను చేపట్టారు. ఆరు నెలలు గడిచేసరికి పార్కు మరింత ఆహ్లాదకరంగా తయారైంది. ప్రతి బుధవారం పార్కుకు సెలవు ప్రకటించి నిర్వహణ చర్యలు చేపట్టేందుకు నిర్ణయించారు. ఈ మేరకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, లయాయాదవ్, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులతో పార్క్‌ను పరిశీలించారు. అనంతరం కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, నగరంలో మహిళల కోసం ప్రత్యేకంగా పార్కు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పార్కు నిర్వహణ బాధ్యతలను ఇన్నర్‌వీల్ క్లబ్ మహిళ ప్రతినిధులకు అప్పగించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు ఉమాబాలాజీ, కమిటీ ప్రతినిధులు, నగరపాలక సంస్థ ఈఈ దక్షిణామూర్తి, ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి పాల్గొన్నారు.

ఔషధాల తయారీలో 'బయోవియో'ది కీలకపాత్ర

• సెంచూరియన్ వైస్ ప్రెసిడెంట్ డీఎన్ రావు



మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డీఎన్ రావు

నెల్లిమర్ల రూరల్: ఔషధాల తయారీలో బయోవియో టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తోందని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఔషధాల ఉత్పత్తి, వినియోగంపై బుధవారం మెగా సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోవిడ్ సమయంలో బయోవియో టెక్నాలజీను ఉపయోగించి వ్యాక్సిన్‌లు తయారు చేశారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఔషధ పరిశ్రమలు బయోవియో ఫార్ములాను అనుసరిస్తున్నారని చెప్పారు. ఛాన్సలర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ, ఔషధాల వాడకంలో, వాటి తయారీకి అవసరమైన డిజైన్ పరిశోధనలకు బయోవియో టెక్నాలజీ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జాతీయ పరిశోధన సంస్థ హెడ్ బిజయ్‌కుమార్ సాహు, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, వర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి స్పందన



శిబిరానికి వచ్చిన వృద్ధురాలితో మాట్లాడుతున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణం, బొడ్డువారి జంక్షన్లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు స్పందన లభించింది. శిబిరాలను కార్పొరేషన్ మేయర్ విజయలక్ష్మియ, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఇప్పటివరకు విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 19,500 పైగా ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకున్నారని చెప్పారు. నేత్ర పరీక్షలు కూడా నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు, సుధీర్, అయ్యప్ప, బాషా, తదితరులు పాల్గొన్నారు.